# మని - షి

"ఇహ మా రెండోవాడున్నాడు టోమాటో రసంచేయనిదే అన్నం తినడుగదాండీ! వేలెడు లేడు వెధవ! వాడు క్రిష్ణలాగా హీరో అయిపోతాట్ట... పైగా వాళ్ళ పిన్నిని హీరోయిన్‌గా తీసుకుంటాట్ట! 'ఏరా వెధవా! అత్తయ్యకు కూతురుందిగదరా' ఉంటే, 'ఛీ చప్పిడి ముక్కు దానిది' అంటాడు...' ఉత్సాహంతో కుమార రత్నం ఘనతని గురించి చెప్పుకుపోతున్న కమల కళ్లు మెరిసిపోతున్నాయి.

తరువాత పీరియడ్ పాఠం ప్రిపేరవడానికి 'మనుచరిత్ర' ముందు పెట్టుకుని కూర్చున్న శ్యామల బుర్రలోకి ఒక్క అక్షరంకూడా దూరటం లేదు. ఎంత వద్దనుకున్నా మాటలు చెవిలోకి దూరి మనసును అల్లకల్లోలం చేస్తున్నాయి. ఉండి ఉండి ఒక్కసారి తల ఎత్తి కమలకేసి చూసి ఆవిడ మొహంలో వెల్లివిరిసే ఆనందాన్ని, కళ్లలో నిండిన కాంతిని చూసి చటుక్కున కనులు దించుకుంది, గుండెలో ఏదో గుబులుగా అనిపించి దామెకు. అంతలోనే ఎక్కడలేని చీకాకు ముంచుకువచ్చింది వాళ్లందరిమీద.

"స్టాఫ్" రూమ్‌లోకూడా పిల్లల ముచ్చట్లు చెప్పుకోకపోతే తోచదు కాబోలు వీళ్లకు. ఇవతలవాళ్లు ఏదో చదువుకుంటున్నారనైనా ఆలోచించరేం?"...

అంతవరకూ అవకాశం కోసమే కాచుకున్నట్టు చటుక్కున అందుకుంది ఫిలాసఫీ లెక్చరర్ మనోరమ! "మరేనండీ! ఈ కాలం పిల్లకాయలు వట్టి ఆకతాయి లవుతున్నారు. మా శైలును చూశారుగదా! నిండా మూడేళ్లు లేవు దానికి... నేను ఒక కొత్త చీర కొన్నా, తలలో ఇన్ని పూలు పెట్టుకున్నా ఓర్చలేదు సుమండి. ఏడ్చి రాగాలు పెట్టేయడమే దానికి ఇచ్చేదాకా! మా వారే భయపడతారుగదా దానికి. పూలపొట్లం తెస్తే తిన్నగా దాని చేతిలోనే పెడతారు, పాపం!"

ఒక వైపు కూతురిమీద ఫిర్యాదు చేస్తున్నట్టే ఉన్నా ఆ చెప్పడంలో తృప్తీ, ఒక విధమైన గర్వమూ, అభిమానమూ తొంగిచూశా యావిడ మాటలలో.

ఇహ అక్కడ కూర్చోలేక విసురుగా పుస్తకం తీసుకుని బయటకు వచ్చేసింది శ్యామల.

"ఎవరిమీదోయ్ అంత కోపంగా ఉన్నావు?" లైబ్రరీముందు ఎదురుపడి అడిగింది సుశీల నవ్వుతూ.

"దేవుడిమీద! వెధవ సొద... కాసేపు శాంతంగా చదువుకోనియరు కదా కర్మ! ఎప్పుడూ మా అమ్మాయి, మా అబ్బాయి, లేకపోతే అత్తగార్లని గురించి గోలగా మాట్లాడ్డం తప్ప మరోపనే లేనట్టుంది వీళ్లకు. ఎంత చదివినా ఆడవాళ్ల బుద్ధి వంట ఇల్లు దాటి పోదేమో!" విసుగ్గా అంది శ్యామల కర్చీఫ్‌తో మొహం ఒత్తుకుంటూ.

"చాలా హాట్‌గా ఉన్నావు గానీ కాస్త కూల్ డ్రింక్ తాగి మరీ మాట్లాడుకుందాం. పద!" అంటూ కాంటీన్‌కు దారితీసింది సుశీల.

"ఊరికే వాళ్లను విసుక్కోవడం దేనికోయ్.... నువ్వూ రేప్పొద్దున్న అంతే!" సుశీల మాటలకు సిగ్గుపడి చిన్నగా నవ్వలేదు శ్యామల.

వినిపించనట్టు మెల్లిగా నిట్టూర్చింది. 'ఆ రేపు వచ్చే గీత ఉండద్దూ అనుకుంటూ.

"సరేగానీ, శ్యామూ! ఎంతకాలం ఇలా కాలేజీ... పాఠాలు అంటూ గడిపేయడమేనా.. పెళ్లి చేసుకోవడమేమైనా ఉందా? లేదూ నేనే వచ్చి మీ అమ్మగారితో చెబుతా తొందరగా ఓ అబ్బాయిని చూడమని. ఇంతకీ ఎవరినన్నా చూస్తున్నారా?" కుతూహలంగా అడిగింది సుశీల.

అప్రయత్నంగానే శ్యామల కళ్లలో నీరు తిరిగింది. చప్పున కనులు వాల్చుకుంది. 'చూడవలసింది అబ్బాయిని కాదే, పిచ్చీ... ఇరవై తొమ్మిది దాటుతున్న నాకు చూడవలసినది ఓ నడివయస్కుడిని.. నా గురించి నీ అంతమాత్రం శ్రద్ధగా అమ్మ గనక ఆలోచిస్తే నే నిలా మొండిగా ఎందుకుండిపోతాను?' మనసులోనే అనుకుంది శ్యామల.

"జవాబు చెప్పవేం, మొద్దూ! లేకపోతే ఉన్నట్టుండి శుభలేఖ ఇచ్చి ఆశ్చర్యంతో ముంచేయాలని ప్లాన్ కాదుకదా?"

చటుక్కున తల ఎత్తి తీక్షణంగా అంది శ్యామల "పదే పదే ఆ ప్రశ్న అడగవద్దని చెప్పేనా లేదా, సుశీ, నీకు? మా అమ్మ చంపేస్తుంది పెళ్లి కొప్పుకోమని. కానీ.. కానీ నాకు మగవాళ్లంటేనే అసహ్యం... పెళ్లంటే పరమ అసహ్యం. అయినా, నా కేం తక్కువయిందని నువ్వు బాధపడిపోతున్నావు? మీలాగా జంజాటకాలు లేకుండా హాయిగా, స్వేచ్ఛగా ఉన్నానని కుళ్లుమోత్తనంగా ఉందా ఏమిటి నీకు? నా మానాన నన్నిలా ఉండనిద్దూ.."

శ్యామల గొంతులో విసుగును గమనించిన సుశీల, తెల్లబోయి నవ్వేసింది. "సరేలే! ఈ రోజు ఇంట్లో ఎవరిమీదో అలిగినట్లున్నావు... ఏన్నాళ్లీ వాదనమీద నిలబడతావో చూస్తానుగా!"

"సారీ! ఏదో చీకాకుతో ఇష్టం వచ్చినట్టు మాట్లాడాను..." నవ్వడానికి ప్రయత్నిస్తూ అని, "సరేగాని, నీవీ ఎరుపురంగు చీర కట్టుకుంటే నాకెంత అసూయగా ఉంటుందో తెలుసా? ఎప్పుడో ఓ రోజు రాత్రి మీ ఇంటికి కన్నం వేసి, ఈ చీర ఎత్తుకపోతాను" అంది నవ్వుతూ.

"అంత పనిమాత్రం చేయకు, తల్లీ! మా శ్రీవారికి ఈ చీరంటే పంచప్రాణం. ఏరి కోరి మోజుపడి మొన్న నా పుట్టిన రోజుకు తెచ్చారు... రెండ్రోజులకోసారి – ఎర్రచీర కట్టుకోవేం?' అంటూ నా ప్రాణాలు తీస్తుంటారు!" సుశీల తమాషాగా నవ్వుతూ అంది.

ఎగసివస్తున్న నిట్టూర్పు ఆపుకుంటూ, కాళ్లీడ్చుకుంటూ క్లాసుకు దారి తీసింది శ్యామల – 'సుశీల ఎప్పుడూ అంత సంతోషంగా నవ్వుతూ ఎలా ఉండగలదు? జీవితమంటేనే విసుగొస్తుందే నాకు...' అనుకుంటూ.

నాలుగు గంటలకు బెల్లు కాగానే, 'ఈ రోజు గడిచిందిరా, దేవుడా!' అనుకుంటూ పుస్తకాలు, పర్సు తీసుకుని కాలేజీ నుండి బయటపడింది శ్యామల, వచ్చేస్తూండగా తెలుగు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంటు సుందరమ్మ హెచ్చరిస్తున్నట్టుగా అంది. "కనీసం రేపటికయినా ఆ పేపర్లు దిద్దడం పూర్తిచేయండి శ్యామలా! మళ్లా ప్రిన్సిపాల్‌గారు ఏమన్నా అంటే బావుండదు!"

ఉన్నపాటునే వెనక్కి తిరిగి, ఆ పేపర్ల కట్ట పెడీమని ఆవిడ ముఖాన కొట్టి, సరాసరి ప్రిన్సిపాల్ దగ్గిరికి వెళ్లి రాజీనామా రాసిపడేసి పోవాలన్నంత కసి పుట్టుకు వచ్చింది శ్యామలకు. కానీ... "అలాగేనండి... ఇంకో పది పేపర్లేమో ఉన్నట్టున్నాయి. రేపు మార్కుల లిస్ట్‌కూడా తయారుచేసి ఇచ్చేస్తాను." నీరసంగా నవ్వి అన్నది.

గుమ్మంలో అడుగు పెడుతుండగానే వీధి గదిలోంచి కిలకిల నవ్వులు వినిపించాయామెకు. 'అమెగారు వచ్చి వారం రోజులు కాకముందే పరిగెత్తుకొచ్చినట్టున్నా డీయనగారు!' పెదవి కొరుక్కుంటూ కచ్చగా అనుకుని, లోపలికి వచ్చి పుస్తకాలు టేబులుమీద విసిరి ఉస్సురంటూ కుర్చీలో కూలబడి, కణతలు నొక్కుకుంది. ఎదురుగా బల్లమీద ఉన్న ఉత్తరం ఆమె దృష్టి నాకర్షించగా తీసి చదవసాగింది.

"ఈ నెల దాని మందులకూ, టానిక్కులకూ చాలా ఖర్చయింది. ఇప్పుడు అయిదో నెల జరుగుతూంది. పెద్దవాడి నీ మధ్య బళ్లో వేశా... అదో మోపెడయింది. అందుచేత ఈసారి ఏమీ పంపించలేను. శ్యాము జీతం రాగానే మరచిపోకుండా వంద రూపాయలు రామారావుగారికి పంపించేయండి. ఇంకో ఆరు నెలలు ఇలాగే కష్టపడితే రత్నం పెళ్లి బాకీ తీరిపోతుంది. అన్నట్టు అది వచ్చిందన్నావు గదా. పాపం, ఓ చీరన్నా కొనివ్వండి. శ్యామును, రత్నను అడిగానని చెప్పు."

అన్నగారి నుండి వచ్చిన లేఖ చదివి శ్యాము గుండె బరువెక్కింది. 'ప్రతి మనిషీ తన స్వార్థం తప్ప ఎదటివాడి బాధను గురించి పట్టించుకోడేం? నా కన్న ఒక ఏడాది మాత్రమే పెద్ద

అయిన తను, ప్రేమలోపడి పెళ్లాడి, ఆవిడ కొంగు పట్టుకొని తిరుగుతున్నాడే! తనలాగే నాకూ కొన్ని కోరికలు, ఆశలు ఉంటాయని గమనించడేం? వాళ్ల కంటికి నేను మనిషిగా కనబడ్డంలేదా? కేవలం డబ్బు సంపాదించి కుటుంబావసరాలూ, బాకీలూ తీర్చే యంత్రాన్నిగా భావిస్తున్నారా?'...

"అదేమే... అలా కూర్చున్నావు రాగానే? కాఫీ ఫ్లాస్కులో పోసి ఉంచింది అమ్మ. తాగరాదూ?" తెల్లనిచీర, జాకెట్టు ధరించి, తలలో మల్లెలతో, చేతిని గలగలలాడే గాజులతో, కలకలలాడే మోముతో వచ్చిన రత్నమాల నవ్వుతూ అడిగింది.

'అలా అడక్కపోతే కాస్త గ్లాసులో తెచ్చివ్వకూడదేమో...' అనుకుంటూ నిర్లిప్తంగా చూసి ఊరుకుంది శ్యామల.

"మీ బావ వచ్చారు సాయంత్రం. సినిమాకు వెడదామంటున్నారు. నువ్వూ వస్తావేమో అడగమన్నారనుకో.. కాని, అంత దూరం నుండి నడిచి వచ్చి నువ్వేం వస్తావు, పాపం? అమ్మ పురాణానికి వెళ్లింది. కాస్త పిల్లలకు అన్నం పెట్టేసి, నీ పని చూసుకుంటావు కదూ? మరి నేవెళ్లనా?..." అంటూనే వెళ్లిపోయింది రత్నమాల. భర్తతో కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ వెళ్ళి రిక్షా ఎక్కిన అక్కను చూస్తూ పేలవంగా నవ్వుకుంది శ్యామల.

కాఫీ తాగి పేపర్లు ముందువేసుకుని దిద్దుతూ కూర్చుంది. "అక్కా!" అంటూ నెమ్మదిగా లోపలికి వచ్చాడు పన్నెండేళ్ల బాబ్జీ. "ఏమిట్రా?" తల ఎత్తకుండానే అడిగింది, శ్యామలకు తెలుసు, ఏదో అవసరముంటే తప్ప అంత వినమ్రంగా రాడు వాడని.

"మరేమో మా క్లాసువాళ్లంతా చంద్రగిరికి ఎక్స్‌కర్షన్ వెడతారట... అమ్మ నడిగితే తిట్టింది. ఒక్క అయిదు రూపాయిలే, అక్కా! ఈ రోజు నీకు జీతం వచ్చిందిగా.. ఇవ్వవూ?" జాలిగా మొహం పెట్టాడు.

మాట్లాడకుండా అయిదు రూపాయలు తీసి వాడి చేతిలో పెట్టింది శ్యామల. 'పోస్టు ఆఫీసుకు వెళ్లి కవర్లు తెచ్చి పెట్టరా, బాబ్జీ' అంటే – నేనేం నీకు నౌఖర్ని కాను' అంటూ దులుపుకుపోయే వీడుకూడా తన పనికోసమయితే ఎంత తియ్యగా మాట్లాడగలడా అని ఆశ్చర్యపడింది మనుసులోనే.

రాత్రి తొమ్మిది గంటలకు పురాణం నుండి వచ్చింది శారదమ్మ. పక్కింటావిడతో సహా, "అమ్మాయి సినిమాకు వెళ్లిందటే?" అంటూ, తల ఊపి ఊరుకుంది శ్యామల.

"ఏం శ్యామలమ్మా! మాకు పప్పన్నమెప్పుడో?" ముందున్న రెండు పళ్లూ పీకించేసుకున్న ఖాళీ చూపిస్తూ నవ్వి అడిగింది తాయారమ్మ.

"పప్పన్నం కాదు, నీ మొహానికి కొరివికారం పెడతాను' అనాలన్నంత కోపం వచ్చింది శ్యామలకు.

"ఏమోనమ్మా! ఈ కాలం చదువుకున్న పిల్లలు మన మాట వింటారా, ఏమన్నానా?

పెళ్లని పేరెత్తితేనే మండి పడుతుందాయె!... అందుకే మా కాలంలో చిన్నప్పుడే ఆ మూడు ముళ్లూ వేయించేసేవారు... ఈ చదువులూ, ఉద్యోగాలు వచ్చాక పిల్లలు మాట వినరమ్మా!" సాగదీస్తూ నిష్ఠూరంగా అంది శారదమ్మ, తన అసహాయతను బయట పెట్టుకోలేని పిరికితనంతో కూతురిమీదే నేరం నెట్టుతూ.

శ్యామలకు మొదట తల్లిమీద పీకలదాకా కోపం వచ్చింది. 'ఈ క్షణం పెళ్లి చెయ్యి, నేను సిద్ధం' అని ఆవిడ మొహాన్నే అందామా అనిపించిందికూడా. కానీ, తను అంతకుముందు సుశీల ముందు అన్నమాటలు గుర్తుకు వచ్చి, తల్లి తనలాగే తనను తాను మోసం చేసుకోవడానికి ప్రయత్నిస్తూందని తోచి, ఆవిడ అసహాయతకు జాలిపడింది. ఆవిడకు మాత్రం కూతురి పెళ్లి చేయాలని ఆశ లేదూ? కానీ, వేలకొద్ది కట్నాలు పోయలేకేగా తనకు ఎమ్.ఎ. చెప్పించి, ఉద్యోగంలో ప్రవేశ పెట్టింది?...

"ఏ వయసులో ఆ ముచ్చట అన్నారు, తల్లీ! ఇప్పుడు కాకపోతే ముసలి దానివయ్యాక చేసుకుంటావా పెళ్లి?" అంది తాయారమ్మ.

"ఇప్పుడు మాత్రం పడుచుదాన్నా?" తలలో సగానికిపైగా పండిపోయిన వెంట్రుకలని తలుచుకుంటూ అనుకుంది శ్యామల, దీర్ఘంగా నిట్టూరుస్తూ.

"జీతం వచ్చిందే, అమ్మాయ్?" అన్నం పెడుతూ అడిగింది శారదమ్మ.

"వచ్చింది" ముక్తసరిగా అన్నది శ్యామల.

"అక్కయ్యకు చీర ఒకటి కొనాలే, శ్యామూ, పండక్కి వచ్చిందా? ఇక అల్లుడిగారికి కనీసం ఒక పంచలచాపేనా పెట్టొద్దూ? వాడేం రాసేడో చూశావా? ఏమిటో - వాడి ఇబ్బంది వాడిది. పాపం, ఆ పిల్ల ఏమవస్థ పడుతూందో చేసుకోలేక? ఇక్కడ నువ్వు ఇంటా బయటా చేసుకోవాలే అన్న బాధ కనక లేకపోతే, వెళ్లి నాలుగు రోజులు ఉండి రావాలనే ఉంది.."

శ్యామల వినలేక కంచంలో చెయ్యి కడుక్కుని లేచిపోయింది. 'అమ్మకికూడా నా గురించి ఆలోచన రాదేం? అందరి గురించీ అంత బెంగ పడిపోతుందిగానీ, నేను చచ్చానా బతికానా పట్టించుకోదేం?" అన్న ఆలోచనతో ఆ పిల్ల మనసు కలతబారింది.

బయట వరండాలో నిలబడి అలా ఆలోచనలో పడ్డ శ్యామల, విజిల్ వినిపించడంతో ఉలికిపడింది. తల ఎత్తే సరికి వెకిలిగా నవ్వుతూ నిలబడి కనిపించాడు, ఎదిరింట్లో ఉంటున్న బ్రహ్మచారి. రాయి తీసి బుర్ర పగలగొడదామా అన్నంత కోపం వచ్చింది శ్యామలకు, 'పోకిరీ వెధవలు. ఆడపిల్ల ఉందంటే వంకర నవ్వులు నవ్వడం, రౌడీవేషాలు వెయ్యడం చేతనవును బాగా...

వీలయితే - ఆ పిల్ల అమాయకురాలయితే కూపంలోకి లాగడానికి వెనుదీయరు గానీ,

మళ్లా పెళ్లి చేసుకోమంటే నీళ్లు నములుతారు – పెద్దవాళ్లు, సంప్రదాయాలు అంటూ.' కసిగా అనుకుంది శ్యామల. అంతలో వీధిలో రిక్షా ఆగిన చప్పుడు కాగా గిరుక్కున తిరిగి లోపలికి వచ్చేసింది. శ్యామలకు అక్క మనసు తెలుసు. బావతో సరదాగా మాట్లాడితే ఆవిడ మొహం ముడుచుకోవటం ఆమెకు అనుభవమే! అందుకే అతగాడి ఎదట పడకుండా ఉండడానికే ప్రయత్నిస్తుంది.

గదిలోకి వచ్చి తిరిగి పేపర్లు దిద్దటం మొదలు పెట్టింది. అమ్మ కొసరి కొసరి వడ్డించడం, బావ పరిహాసోక్తులు, అక్క చిలిపి నవ్వులు ఆమె చెవికి సోకుతూనే ఉన్నాయి. కాస్సేపయిన తరవాత ఇల్లంతా నిశ్శబ్దంగా అయిపోయింది. పుచ్చపువ్వులాటి వెన్నెలను చూస్తుంటే, కాసేపు హాయిగా దొడ్లో తులసి గట్టుమీద వెన్నెట్లో పడుకుందామా అనిపించింది శ్యామలకు. అంతలో మరునాడు చెప్పవలసిన పాఠాలు గుర్తు వచ్చి, పుస్తకాలు ముందర వేసుకుని కూర్చుంది.

ఏదో వెలితి.. గుండెలు నిండిన దిగులు పుస్తకాలు విసిరేసి ఎక్కడికైనా పారిపోదామా అనిపించింది శ్యామలకు. 'ఎక్కడకు పోవాలి? ఎవరున్నారు తనను ఆదరించేవారు? కన్న వాళ్లకే కాకపోయింది. ఎవరూ లేరు. నా కోసం ఎవరూ బాధపడరు అప్రయత్నంగానే డైరీ తీసి రాసుకుంది శ్యామల : లైఫ్ కెన్ బి బిట్టర్ టుది వెరీ బోన్, వెన్ వన్ ఈజ్ పూర్ అండ్ ఎ ఉమన్ అండ్ ఎలోన్." నీళ్లు నిండిన కళ్లకు అక్షరాలు అలుక్కుపోయి కనిపించాయి.

ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక

తేది : 18-11-1970